సాక్షి రంగారెడ్డి

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



ఉర్సుకు సర్వం సిద్ధం

చారిత్రక నేపథ్యం కలిగిన పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా 759వ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైంది. 8లో▸



వేగంతో కారు పల్టీ..

అతివేగంగా వెళ్తున్న ఓ కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని, డివైడర్‌ను ఢీకొట్టి బ్రిడ్జ్ పైనుంచి కింద పడింది. 8లో▸



బర్డ్ ఫ్లూ కలవరం!

పౌల్ట్రీ రైతులను కొత్త భయం వెంటాడుతోంది. ఏపీలో బర్డ్ ఫ్లూతో కోళ్లు మృత్యువాతపడడంతో కలవరానికి గురవుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని కబడ్డీ గ్రౌండ్‌లో గురువారం సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవికుమార్, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాలో జరగనున్న 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 76619 92581, 90000 38272 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జేపీదర్గాను దర్శించుకున్న సినీహీరో విశ్వక్‌సేన్



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న విశ్వక్‌సేన్

కొత్తూరు: సినీనటుడు విశ్వక్‌సేన్ బుధవారం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జేపీదర్గాను దర్శించుకున్నారు. ఇందులో భాగంగా బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన హీరోగా నటించిన లైలా చిత్రం త్వరలో విడుదల కాబోతున్న సందర్భంగా దర్గాను దర్శించుకున్నట్లు సమాచారం.

ఆయుష్మాన్ కేంద్రంలో నాణ్యమైన సేవలు



వర్చువల్ సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

కొత్తూరు: ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం పరిధిలో ప్రజలు, రోగులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పటికే కేంద్రంలో కొనసాగుతున్న జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ వర్చువల్ సమీక్షను పరిశీలించారు. ఇందులో భాగంగా ఆరోగ్యకేంద్రం నిర్వహణ, టీకాలు, పరిసరాల పరిశుభ్రతపై వైద్యులు, సిబ్బంది అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ఎస్‌బీపల్లి ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాన్ని జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ గుర్తింపు పొందే విధంగా చూడాలని జిల్లా వైద్యాధికారి ఆ సంస్థ డాక్టర్ షకీలాను కోరారు. దీంతో ఆమె సానుకూలత వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి ఆరోగ్యకేంద్రాలు, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మెలిగి చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్, ఎంక్వాస్ టీం సభ్యులు వినయ్, రాము, అక్రమ్, ఆరోగ్యకేంద్రం వైద్యుడు రామ్‌నాయక్, సిబ్బంది శ్రీనివాసులు, నాగేష్, అనసూయ, ఏఎన్‌ఎం దుర్గ పాల్గొన్నారు.

'కొండా' ఆశయ సాధనకు కృషి చేయాలి



లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చిరంజీవులు తదితరులు

హుడాకాంప్లెక్స్: కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలీలకే కాదు బీసీ బహుజనులందరికీ బాపూజీ అని ఐఏఎస్ మాజీ అధికారి, బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు అన్నారు. కొత్తపేట చౌరస్తాలో బుధవారం తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురాంనేత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, పలువురు ప్రముఖులతో కలిసి బాపూజీ విగ్రహం ఏర్పాటు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలంతా ఏకం కావాలని, రాజ్యాధికారం చేపట్టాలని బాపూజీ కల అని పేర్కొన్నారు. ఆయన కలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్ చౌరస్తాలో త్వరలో లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ కులాల సమన్వయ వేదిక ప్రధాన కార్యదర్శి దుస్సా యాదగిరి, చామకూర రాజు, కర్నాటి మనోహర్, పీవీటీ మార్కెట్ చైర్మన్ ధనుంజయ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సుధాకర్ మాదిగ, బీసీ జాక్ జాతీయ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

శివారులో కోడ్తీ





రూ.లక్షల్లో బెట్టింగులు

కోడి పందేలకు అడ్డాలుగా నగర శివారు ప్రాంతాలు

- సంక్రాంతి తరువాత ఏటా ఇక్కడ నిర్వహణ
- వ్యవసాయ క్షేత్రాల్లో జోరుగా జూదం

ప్రత్యేక నిఘా



ఫాంహౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాల్లో జరిగే కార్యక్రమాలపై నిఘా పెట్టాం. ప్రతి వారాంతరాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అయినా కొన్ని చోట్ల సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతూనే ఉన్నాయి. వాటిపైనా ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం. ఫాంహౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాల్లో సంఘ విద్రోహ కార్యకలాపాలు చేపడితే చర్యలు తీసుకుంటాం.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

మొయినాబాద్: సంక్రాంతి అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది కోడిపందేలు. పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం ఆంధ్రాలో నాలుగు రోజుల పాటు పందేలు నిర్వహించడం సాధారణమే. పండుగ తరువాత కూడా హైదరాబాద్ నగర శివారుల్లో కోడి పందేలు నిర్వహించడమే ప్రత్యేకం. ఏటా సంక్రాంతి తరువాత శివారు ప్రాంతాల్లో ఎక్కడో ఒకచోట కోడి పందేలు నిర్వహించడం.. పోలీసులకు పట్టుబడటం వెలుగుచూస్తూనే ఉన్నాయి. నగర శివారు ప్రాంతాలు కోడి పందేలకు అడ్డాలుగా మారాయి. శివారుల్లో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లోనే పందేల నిర్వహణ ఎక్కువగా జరుగుతోంది. మొయినాబాద్ ప్రాంతంలో ఇరవై రోజుల వ్యవధిలో రెండు చోట్ల కోడి పందేలు నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇక పోలీసులకు చిక్కకుండా ఎన్నో పందేలు జరుగుతున్నాయి.

ప్రతి సంవత్సరం వరుసగా..

మొయినాబాద్ ప్రాంతంలోని ఫాంహౌస్‌ల్లో ప్రతి సంవత్సరం ఎక్కడో ఒక చోట కోడి పందేలు నిర్వహిస్తూనే ఉన్నారు. పదేళ్లుగా చూస్తే ఏటా ఒకటి రెండు చోట్ల పోలీసులు దాడి చేసి కోడి పందేలను భగ్నం చేసి పందెం రాయుళ్లను పట్టుకుంటున్న ఘటనలు వెలుగు చూస్తూన్నే ఉన్నాయి. గతంలో సురంగల్, మేడిపల్లి, అప్పోజీగూడ, చందానగర్, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ పరిసరాల్లో ఉన్న ఫాంహౌస్‌ల్లో కోడి పందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన పందెం రాయుళ్ల నుంచి నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లు, కోళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.



తోలుకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో కోడి పందేలపై విచారిస్తున్న పోలీసులు (ఫైల్)

ఆంధ్రాలో ముగిసాక..

ఆంధ్రాలో పందేలు ముగిసిన తరువాత అక్కడి కోళ్లను నగర శివారు ప్రాంతాలకు తీసుకొచ్చి పందేలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పందేల్లో సైతం ఆంధ్రా సెటిలర్స్ ఎక్కువగా పాల్గొంటున్నట్లు పట్టుబడినవారిని చూస్తే స్పష్టమవుతోంది. మరోవైపు పందెం కోళ్లను నగర శివారు ప్రాంతాల్లోని ఫాంహౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాల్లో పెంచి సంక్రాంతి సమయంలో ఆంధ్రాకు తరలిస్తున్నారు.

ఇరవై రోజుల్లో రెండు చోట్ల..

ఇరవై రోజుల వ్యవధిలో మొయినాబాద్‌లో రెండు చోట్ల కోడి పందేలు నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇరవై రోజుల క్రితం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఓ ఫాంహౌస్‌లో పందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. తాజాగా మంగళవారం రాత్రి మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహిస్తుండడంతో సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి దాడి చేశారు. 64 మంది పందెం రాయుళ్లను పట్టుకుని వారి నుంచి రూ.30 లక్షల నగదు, 55 ఖరీదైన కార్లు, 46 కోడి కత్తులు, 64 సెల్‌ఫోన్లు, 84 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేసిన సమయంలో నగదు పెద్ద మొత్తంలో ఉందని.. పోలీసులు మాత్రం రూ.30 లక్షలే దొరికినట్లు తప్పుడు లెక్కలు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కోడి పందేల్లో పట్టుబడ్డ 64 మందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు బుధవారం వారికి నోటీసులు ఇచ్చి పంపారు. ఎప్పుడు పిలిచినా హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.



రంగరాజన్‌ను పరామర్శించి మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

రంగరాజన్‌పై దాడి బాధాకరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై రామ భక్తుల ముసుగులో దాడి చేయడం బాధాకరమని.. అలాంటి దొంగ భక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. ఆయనతో మాట్లాడి దాడి విషయాలను తెలుసుకున్నారు. దేవుడి సేవలో ఉన్న రంగరాజన్ నిజమైన రామ భక్తుడన్నారు. నిజమైన రామ భక్తుడిపై రాముడి పేరుతో వచ్చిన దొంగ భక్తులు దౌర్జన్యలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారతదేశం సకల మతాలకు నిలయమైన దేశమని.. ఇప్పుడు రాముడి పేరుతో రాజకీయాలు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని.. ఇది ముమ్మాటికీ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. హిందూ మతవాదులు రాముడిని కొందరికే పరిమితం చేసి ప్రజలను విడకొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటూ రంగరాజన్‌పై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర చారి, నాయకులు పర్వతాలు, రామస్వామి, ప్రభులింగం, శ్రీనివాస్, సత్తిరెడ్డి, సుధీర్, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, సుధాకర్‌గౌడ్, అంజయ్య, వెంకటయ్య, రఘురాం, నారాయణ, మధు తదితరులు ఉన్నారు.

ధర్మద్రోహులను క్షమించేది లేదు

చిలుకూరు బాలాజీ అర్చకుడు రంగరాజన్‌పై దాడికి పాల్పడిన ధర్మద్రోహులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధుల బృందం డిమాండ్ చేసింది. బుధవారం వీహెచ్‌పీ ప్రతినిధుల బృందం చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లి అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించింది. ఆయనతో మాట్లాడి దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. ధర్మ రక్షణకోసం సేవ చేస్తున్న రంగరాజన్‌కు అండగా ఉంటామని భరోసా ఇస్తున్నామని పేర్కొన్నారు. పరామర్శించినవారిలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్ సింగ్, సునితారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, బాలస్వామి, పద్మశ్రీ, వాణి సక్కుబాయి, ప్రేమలత, రంగనాథ్, నందకిషోర్, మధుసూదన్‌రెడ్డి, హరినాథ్ తదితరులు ఉన్నారు.

విన్నపాలు వినాల్సిందే..

అందుబాటులో ఉండాల్సిందే

- సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య.. ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాల్సిందే
- అధికారులకు బల్దియా కమిషనర్ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: కోటిమందికి పైగా ప్రజలకు సేవలందించాల్సిన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో, జోనల్ కార్యాలయాల్లో అధికారులు సందర్శకులకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఉసూరుమంటున్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సందర్శకుల సమయం అని కార్యాలయాల వద్ద బోర్డుల మీద ఉంటున్నప్పటికీ, అధికారులు మాత్రం అందుబాటులో ఉండటం లేదు. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీలోని అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులను సందర్శకులు కలిసేందుకు వీలుగా సాయంత్రం 4–5 గంటల మధ్య తమ కార్యాలయాల్లో ఉండాల్సిందేనని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సర్క్యులర్ జారీ చేశారు. అన్ని పని దినాల్లో (ప్రజావాణి ఉన్న రోజు మినహా) ప్రజల వేదనలు వినేందుకు, వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు కార్యాలయాల్లో ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా అనివార్య కారణాలతో, ఇతర పనులతో ఉండటం సాధ్యం కాని పక్షంలో ముందస్తుగానే ఆ విషయాన్ని అడిషనల్ కమిషనర్ (కోఆర్డినేషన్)కు తెలియపర్చాలని ఆదేశించారు. ఫిర్యాదులను తీసుకోవడంతో పాటు వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతిరోజూ తమ వద్దకు ఎంతమంది వస్తున్నారో, ఎన్ని ఫిర్యాదులందుతున్నాయో, వాటిలో ఎన్ని పరిష్కరించారో తనకు ప్రతి వారం నివేదిక అందజేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులందరికీ విజిటర్స్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తేవాల్సిందిగా ఐటీ విభాగానికి సూచించారు. తద్వారా ఏయే అధికారిని ప్రతి వారం ఎంతమంది సందర్శకులు కలుస్తున్నారో తెలుస్తుందని, ప్రజలకు ఏయే అంశాల్లో ఎక్కువ సమస్యలున్నాయో తెలుసుకోవచ్చని కమిషనర్ భావిస్తున్నారు.

అయినా.. వారు మారలేదు..!

కమిషనర్ ఈ సర్క్యులర్‌జారీ చేసి వారం రోజులైనప్పటికీ, ఇప్పటికీ ఇంకా పలువురు అధికారులు సందర్శకుల సమయాల్లో తమ కార్యాలయంలో ఉండటం లేదు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆరు అంతస్తుల్లో ఉండాల్సిన వివిధ విభాగాలకు చెందిన అడిషనల్ కమిషనర్లు, విభాగాధిపతుల్లో కనీసం ఇరవై శాతం మంది కూడా బుధవారం కనిపించకపోవడం గమనార్హం.

'సహకారం'.. సందిగ్ధం

- రేపటితో ముగియనున్న పీఏసీఎస్‌ల గడువు
- పొడిగింపా.. ప్రత్యేక పాలనా?
- ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- జిల్లాలో 38 సహకార సంఘాలు
- సభ్యులుగా 1,66,105 మంది రైతులు



షాద్‌నగర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

షాద్‌నగర్: రైతులకు అండదండగా నిలిచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గడువు ఈ నెల 14 (శుక్రవారం)తో ముగియనుంది. పాలక వర్గాల గడువును ప్రభుత్వం మరికొన్ని నెలలు పొడిగిస్తుందా లేక ప్రత్యేకాధికారులను నియమిస్తారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. జిల్లాలో 38 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వీటికి 2020లో ఎన్నికలు జరిగాయి. ఆయా సంఘాల్లో మొత్తం 1,66,105 మంది రైతులు సభ్యత్వం తీసుకున్నారు. ప్రతి పీఏసీఎస్‌లో 13 మంది సభ్యుల చొప్పున 481 మంది డైరెక్టర్లు ఎన్నికయ్యారు.

ఇప్పట్లో ఎన్నికలు లేనట్టేనా..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం నిర్ణీత సమయంలో ఎన్నికలు జరపాలంటే గడువుకు కనీసం 45 రోజుల ముందే ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో సందిగ్ధం నెలకొంది. ఇప్పట్లో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని భావిస్తున్నారు. పాలక వర్గాల గడువును ప్రభుత్వం ఆరు నెలలు పొడిగిస్తుందా లేక ప్రత్యేకాధికారులను నియమిస్తుందా అనేది తేలాల్సి ఉంది.

స్థానిక సంస్థల ఎన్నిక తర్వాతే..

గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తర్వాతే పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చర్చించుకుంటున్నారు. అదే జరిగితే అప్పటి వరకు ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగించే అవకాశం ఉంది. మరోవైపు పీఏసీఎస్ చైర్మన్ పదవులపై ఇప్పటికే అధికార పార్టీ నాయకులు దృష్టి సారించారు. రాజకీయంగా ఆశించిన పదవులు రాకున్నా, రిజర్వేషన్లు అనుకూలించకున్నా చివరికి ఈ పదవినైనా దక్కించుకోవాలని కొందరు నేతలు భావిస్తున్నారు.

కొత్త సంఘాలకు ప్రతిపాదనలు

జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న 38 సంఘాలకు తోడుగా కొత్తగా మరో 11 ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కొత్తగా ఏర్పాటు చేసే ప్రాథమిక సహకార సంఘాల ప్రతిపాదనలను సిద్ధం చేసి అధికారులు ప్రభుత్వానికి పంపించారు.

ఆదేశాలు రావాల్సి ఉంది



ప్రాథమిక సహకార సంఘాల పాలక వర్గాల గడువు మరో రెండు రోజుల్లో ముగియనుంది. వీరి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారా, అదే కమిటీలను పొడిగిస్తారా అనేదానిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

– రఘునందన్, సీఈఓ, పీఏసీఎస్, షాద్‌నగర్

అధునాతన సౌకర్యాలతో చేవెళ్ల బస్‌స్టేషన్

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: జిల్లాలో ఎక్కడా లేని విధంగా అధునాతన సౌకర్యాలతో చేవెళ్ల బస్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నూతన బస్‌స్టేషన్‌ను జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్, రీజినల్ మేనేజర్ శ్రీలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల నేడు నేరవేరిందని అన్నారు. సబర్బన్ సర్వీస్‌లు, బస్‌పాస్‌లను చేవెళ్ల, శంకర్‌పల్లి వరకు పొడిగించాలని, అన్ని గ్రామాలకు బస్సు సర్వీస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి చేవెళ్ల బస్ డిపో ఏర్పాటుకు కృషిని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు గోనె ప్రతాప్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, హెచ్‌ఎండీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పారావు, వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం జరగాల్సింది ఆలస్యం

బస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి మధ్యాహ్నం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి వస్తున్నారని అన్ని ఏర్పాట్లు చేశారు. వారి కోసం సాయంత్రం వరకు వేచి చూశారు. సీఎంతో కేబినెట్ సమావేశంలో వారంతా బిజీగా ఉన్నారని తెలియడంతో చివరికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఇదిలా ఉంటే కార్యక్రమానికి హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తన పేరు బోర్డులో వేయలేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే ఆయనను సముదాయించారు.



బస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

సీఎంను కలిసిన నియోజకవర్గ నేతలు

చేవెళ్ల కాంగ్రెస్‌లో వర్గపోరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ తన వర్గీయులతో వెళ్లి బుధవారం ముఖ్యమంత్రిని కలిశారు. పైకి మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెబుతున్నా తమకు పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదనే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. చేవెళ్లకు ప్రత్యేకంగా సమయం ఇస్తానని.. సమస్యలు పరిష్కరించుకుందామని ఆయన సర్దిచెప్పినట్టు సమాచారం. చేవెళ్ల బస్‌స్టేషన్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి సైతం తమకు సమాచారం ఇవ్వలేదని.. ఇలా అయితే పార్టీలో ఎలా కొనసాగాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు దృష్టికి సైతం తీసుకెళ్లినట్టు వారు చెప్పారు. దీని కారణంగానే మంత్రులు బస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి రాలేదని తెలుస్తోంది.



సీఎం రేవంత్‌రెడ్డితో భీంభరత్ తదితరులు

అర్చకుడిపై దాడి కేసులో మరో ఆరుగురి అరెస్ట్

- శ్రీకాకుళంలో ఐదుగురు, వరంగల్‌లో ఒకరిని పట్టుకున్న పోలీసులు
- భద్రాచలం వద్ద మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడిపై జరిగిన దాడి కేసును పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డితోపాటు మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు బుధవారం మరో ఆరుగురిని అరెస్టు చేశారు. వీరితో పాటు భద్రాచలం సమీపంలో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రామరాజ్యం సైన్యం పేరుతో 26 మంది ఈ నెల 7న చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆయన ఫిర్యాదుతో మొయినాబాద్ పీఎస్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రెండు బృందాలతో గాలింపు చేపట్టి 8న ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని అరెస్టు చేయగా మరుసటిరోజు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న 20 మంది కోసం రెండు బృందాలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వీరబాబు, మూర్తి, గోవిందరావు, ఎల్.వెంకటరమణ, ఎం.వెంకటరమణను బుధవారం అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. మరో బృందం తెలంగాణలో చేపడుతున్న గాలింపు చర్యల్లో భాగంగా నగరంలోని బోడుప్పల్‌కు చెందిన శ్రీనివాస్ అలియాస్ సేనను వరంగల్‌లో అరెస్టు చేశారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించి రిమాండ్‌కు తరలించారు.

పరారీలో మరో 14 మంది

అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ఇప్పటి వరకు పోలీసులు మొత్తం 12 మందిని అరెస్టు చేశారు. మరో 14 మంది పరారీలోనే ఉన్నారు. వీరిలో భద్రాచలం వద్ద మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారికోసం గాలింపు కొనసాగుతోంది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేపడుతున్నారు.

వేగంతో కారు పల్టీ.. త్రుటిలో తప్పిన ప్రమాదం


ఘటనా స్థలిలో కారు

కందుకూరు: అతివేగంగా వెళ్తున్న ఓ కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని, డివైడర్‌ను ఢీకొట్టి బ్రిడ్జ్ పైనుంచి కింద పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నం పటేల్‌గూడకు చెందిన రాజేష్‌గౌడ్ నిత్యం మండల పరిధిలోని ఎన్టీఆర్‌తండా సమీపంలోని ఓ రైతు నుంచి పాలను సేకరించి హైదరాబాద్‌కు కారులో తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పాలను తీసుకుని కారులో ఫార్మా రహదారిపై బయలుదేరాడు. కొంత సేపటికే కందుకూరు సోమదేవుని చెరువు ముందు అతివేగంగా కారును నడుపుతూ డివైడర్, ముందున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పల్టీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న యాచారం మండలం కుర్మిద్దకు చెందిన ప్రవీణ్‌నాయక్‌తో పాటు కారులో ఉన్న రాజేష్‌గౌడ్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో స్థానికులు నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షలత ఆధ్వర్యంలో ఆర్‌కేపురంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు బుధవారం నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు జర్కిన్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు జర్కిన్లు అందజేసిన నర్సింహారెడ్డి

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

బ్యాంకు ఖాతాలు అందించిన నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరాదితో పాటు విదేశాల్లో ఉండి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితులకు సహకరించిన ఇద్దరు నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. నగరంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరిని వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసినట్లు అధికారులు బుధవారం ప్రకటించారు. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన పి.ఉమామహేష్ సైబర్ నేరగాళ్లకు తన బ్యాంకు ఖాతా ఇవ్వడంతో పాటు మరికొన్ని ఎకౌంట్ల వివరాలు ఇచ్చాడు. వీటిని వినియోగించి ప్రధాన సూత్రధారులు తెలంగాణలో మూడింటితో సహా దేశ వ్యాప్తంగా ఎనిమిది నేరాలు చేశారు. నగరానికి చెందిన ఓ 55 ఏళ్ల ఉద్యోగికి సోషల్ మీడియా ద్వారా ఎర వేశారు. గోల్డ్ ట్రేడింగ్‌లో సహకరిస్తామంటూ నమ్మబలికి ప్రత్యేక యాప్‌లో ఖాతా తెరిపించారు. బాధితుడి నుంచి దఫదఫాలుగా రూ.43.36 లక్షలు కాజేసిన నేరగాళ్లు ఆపై యాప్‌లోని ఖాతా పని చేయకుండా చేశారు. బాధితుడి నుంచి డబ్బు డిపాజిట్/బదిలీ చేయించుకోవడానికి వాడిన ఖాతాల్లో ఉమామహేష్ ఖాతా ఉంది. బాధితుడి ఫిర్యాదుతో నమోదైన కేసులో పోలీసులు ఉమా మహేష్‌ను అరెస్టు చేశారు. అలానే నగరానికి చెందిన మరో ప్రైవేట్ ఉద్యోగికీ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ద్వారా ఎర వేశారు. గూగుల్ రివ్యూలు, టాస్క్‌లు పూర్తి చేస్తే నగదు ఇస్తామని నమ్మించారు. ఆయన నుంచి రూ.25.36 లక్షలు కాజేసి మోసం చేశారు. ఇతడి నుంచి డబ్బు వెళ్లిన ఖాతాల్లో నగరానికి చెందిన సీహెచ్ నవీన్ ఖాతా కూడా ఉందని పోలీసులు గుర్తించారు. కమీషన్లకు ఆశపడి సైబర్ నేరగాళ్లతో కలిసి పని చేసినట్లు తేల్చారు. దీంతో ఇతగాడినీ అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.


కొండపైన ఉన్న షర్ఫుద్దీన్ బాబా దర్గా


అలంకరణలో దర్గా కమాన్

ఉర్సుకు సర్వం సిద్ధం

- ముస్తాబైన పహాడీషరీఫ్ దర్గా
- 15 నుంచి వారం పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: చారిత్రక నేపథ్యం కలిగిన పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా 759వ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైంది. అన్ని వర్గాల ప్రజలతో నిత్యం కళకళలాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ దర్గాలో ఏటా ఉర్సు వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న ఈ దర్గాను పీర్‌జాదుగన్‌లు పర్యవేక్షిస్తూ వస్తున్నారు. బాబా షర్ఫుద్దీన్ దర్గాను దర్శించుకుంటే ఆయురారోగ్యాలతో వర్ధిల్లడంతో పాటు అనుకున్న కార్యం నెరవేరుతుందన్న నమ్మకంతో ప్రజలు ఇక్కడ పెద్ద ఎత్తున గ్యార్మీ షరీఫ్‌లు నిర్వహించడం అనాధిగా వస్తుంది. భక్తులు దర్గాలోని బాబా సమాధికి పూలు, చాదర్ సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా ఆవరణలో పెద్ద ఎత్తున దుకాణాలు, రంగుల రట్నాలు వెలిశాయి.

కార్యక్రమాలు ఇవే..

- ఈ నెల 15న రాత్రి దర్గాలో నిర్వహించే ఖసీదయే బుర్దాషరీఫ్‌తో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.
- అదేరోజు అర్ధరాత్రి 12 గంటలకు బాలాపూర్ గ్రామంలోని చిల్లా నుంచి భక్తుల కోలాహలం నడుమ గంధం ఊరేగింపు ప్రారంభమవుతోంది. అక్కడి నుంచి కొత్తపేట, వెంకటాపూర్, షాహిన్‌నగర్, జల్‌పల్లి కమాన్ ప్రాంతం సమీపంలోని దర్గా శక్కర్ షా వలీ వద్ద ఫజర్ నమాజ్ నిర్వహిస్తారు. అక్కడి నుంచి కొనసాగింపుగా 16వ తేదీన ఉదయం 8 గంటలకు దర్గాపైకి ఊరేగింపు వెళుతోంది.
- 18న రాత్రి చార్మినార్ సమీపంలోని పంజెషా నుంచి నిజాం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే గంధం ఊరేగింపు మరుసటి రోజు ఉదయం పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుంటుంది.
- 19న రాత్రి 7 గంటలకు దీపాల కార్యక్రమం ఉంటుంది.
- 20న రాత్రి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న అధికారి పోలీస్ సందల్‌లో భాగంగా పూలు, చాదర్ తలపై పెట్టుకొని ఊరేగింపుగా వచ్చి సమర్పిస్తారు.
- 21న నిర్వహించే ఉస్లీ షరీఫ్ (పూల మాలల సమర్పణ)తో ఈ ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయి.

నేపథ్యం ఇదీ..

759 ఏళ్ల క్రితం ఇరాక్ దేశస్తుడైన కుతుబ్-హుల్-అక్తాబ్ షహెన్‌షా-ఇ-దక్కన్ సుల్తాన్-ఉల్ ఆరిఫీన్ హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ మన దేశానికి వచ్చి పహాడీషరీఫ్ గ్రామంలోని ఎత్తైన కొండపై దట్టమైన అడవి, క్రూర మృగాలు, విష సర్పాల సంచారం నడుమ ప్రార్థనలు ప్రారంభించాడు. అలాంటి వాతావరణంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న సమయంలో బాబా షర్ఫుద్దీన్ ప్రార్థనలను చూసి భక్తులు ఆయనను ఆరాధించడం మొదలెట్టినట్లు ప్రాచుర్యంలో ఉంది. మన దేశ పర్యటనలో భాగంగా బాబా మొదటిసారిగా బాలాపూర్ గ్రామంలో విశ్రాంతి తీసుకొని అక్కడి నుంచి పహాడీషరీఫ్ గ్రామానికి చేరుకొని ఈ కొండపైకి మకాం మార్చారు. ఇందులో భాగంగానే మొదటి గంధాన్ని బాలాపూర్ నుంచి తీస్తున్నారు.

360 మెట్లే ప్రత్యేక ఆకర్షణ

పహాడీషరీఫ్ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దర్గాకు 360 మెట్లు ప్రత్యేక ఆకర్షణ అని స్థానికులు చెబుతుంటారు. పూర్వం హైదరాబాద్ నిజాం నవాబు మహబూబ్ అలీ బాబా దర్శించుకునేందుకు వచ్చిన సమయంలో సుమారు వెయ్యి అడుగుల ఎత్తులో ఉన్న ఈ దర్గాకు సరైన మార్గం లేదు. దర్గాకు పైకి ఎక్కే సమయంలో నిజాం నవాబు కాలికి గాయమైంది. దీంతో రాజునైన తనకే గాయాలైతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని దర్గాకు 360 మెట్లు, పక్కనే మసీదును నిర్మించారు. నిజాం కాలంలో నిర్మించిన మెట్లు నేటికి చెక్కు చెదరకుండా ఉండటం విశేషం.



వైభవంగా నిర్వహిస్తాం



ఈసారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. బాబా మొదటిసారి బాలాపూర్‌కు వచ్చిన గుర్తుగా ఏటా చిల్లా నుంచి మొదలుకొని పహాడీషరీఫ్ వరకు గంధం తీసుకొని కాలినడకన భక్తులు దర్గాలోకి ప్రవేశిస్తారు. బాబా ఆశీస్సులతో ఎంతో మంది రాజకీయ, వ్యాపార రంగాల్లో కొనసాగుతున్నారు. ఇక్కడ నిత్యాన్నదానంపై ఆధారపడి వందలాది మంది యాచకులు జీవిస్తున్నారు.

– సయ్యద్ ఫరీదుద్దీన్ సువర్‌వర్దీ, దర్గా పర్యవేక్షకుడు

సదుపాయాలు కల్పించాం



ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని మున్సిపాలిటీ తరఫున అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇందుకోసం రూ.5 లక్షల నిధులు కేటాయించాం. ప్రత్యేకంగా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి హెల్త్, ఎలక్ట్రికల్, ఫైర్, పోలీస్, వాటర్‌వర్క్స్, ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేస్తున్నాం. పారిశుద్ధ్యం, నీటి సరఫరా సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– వెంకట్రామ్, కమిషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ

గట్టి బందోబస్తు



ముఖ్యంగా 15వ తేదీన రాత్రి ప్రధాన ఊరేగింపు రోజు దారి పొడవునా ఆర్మీ ఫోర్స్, రోప్ పార్టీలతో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగుతోంది. దర్గా నిర్వాహకులు కూడా వాలంటీర్లను నియమించుకోవాలి. ఈ ఉత్సవాలకు అందరూ సహకరించి శాంతియుతంగా జరుపుకోవాలి. సంప్రదాయంలో భాగంగా పోలీస్‌స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు నిర్వహిస్తాం.

– గురువారెడ్డి, ఇన్‌స్పెక్టర్, పహాడీషరీఫ్

చికిత్స పొందుతూ యువకుడి మృతి


భరత్‌కుమార్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: బైక్ అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బృందావన్ కాలనీలో నివాసముండే భరత్‌కుమార్(25) నగర శివార్లలోని ఓ పెట్రోల్ బంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీకి ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి గుంతలోకి వెళ్లడంతో కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలైన భరత్‌కుమార్‌ను నగర శివార్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్టార్ హోటల్‌లో బంగారు నగల చోరీ

ఫిలింనగర్: నిశ్చితార్థ కార్యక్రమానికి విచ్చేసిన ఓ కుటుంబం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-92లోని తాజ్‌మహల్ హోటల్‌లో బస చేయగా పెళ్లి కూతురుకు సంబంధించిన నగలు చోరీకి గురైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మాదాపూర్ ఖానామెట్‌కు చెందిన రాజవరం దీపిక తన కూతురి నిశ్చితార్థం సందర్భంగా రోడ్డు నెంబర్-92లోని తాజ్‌మహల్ హోటల్‌లో రెండు గదులు బుక్ చేసుకున్నారు. హోటల్ యాజమాన్యం ఆమెకు 201, 209 గదులు కేటాయించింది. ఈ నెల 8వ తేదీన నిశ్చితార్థానికి పెళ్లి కూతురు ఆభరణాలు ధరించి..కార్యక్రమం ముగిసిన తరువాత రాత్రి హోటల్ గదికి వచ్చి బ్యాగ్‌లో సర్దుకుంది. ఆ తెల్లవారు ఇంటికి వెళ్లి చూసుకోగా బ్యాగ్‌లో కొన్ని ఆభరణాలు కనిపించలేదు. ఇల్లంతా వెతికినా ఫలితం లేకపోవడంతో తాము బస చేసిన తాజ్‌మహల్ హోటల్‌కు వచ్చి గదిలోనూ, ఆవరణలోనూ గాలించారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తామని హోటల్ యాజమాన్యానికి చెప్పగా, అవి మరమ్మతులో ఉన్నాయని తెల్చారు. దుండగులు బస చేసిన హోటల్ గదిలోకి ప్రవేశించి ఆభరణాలు దొంగిలించి ఉంటారని అనుమానిస్తూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇంత పెద్ద హోటల్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీస్ కస్టడీకి ప్రిజం పబ్ కాల్పుల నిందితుడు

గచ్చిబౌలి: ప్రిజం పబ్‌లో కాల్పులకు తెగబడ్డ ప్రధాన నిందితుడు బత్తుల ప్రభాకర్‌ను గచ్చిబౌలి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కూకట్‌పల్లి పదో మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి షాలిని ఈ నెల 14వ తేదీ వరకు ప్రభాకర్‌ను పోలీసు కస్టడీకి అనుమతించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ నెల 1న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్‌లో సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డికి బుల్లెట్ గాయమైనప్పటికీ బౌన్సర్ల సహాయంతో హెడ్ కానిస్టేబుళ్లు వీరస్వామి, ప్రదీప్‌రెడ్డిలు ప్రభాకర్‌ను చాకచక్యంగా పట్టుకున్నారు. 80కి పైగా కేసుల్లో నిందితుడుగా ఉన్న ప్రభాకర్ 23 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నారు. మొయినాబాద్ పీఎస్ పరిధిలో వీజేఐటీ, కేజీ ఇంజనీరింగ్ కాలేజీల్లో రాత్రి సమయంలో చోరీలకు పాల్పడి దాదాపు రూ.24 లక్షల నగదును చోరీ చేశాడు. ఈ కేసుల్లోనే పట్టుకునేందుకు సీసీఎస్ పోలీసులు ప్రయతి్నంచగా రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. నిందితుడి వద్ద మూడు కంట్రీ మేడ్ గన్‌లు, 451 బుల్లెట్లు లభించడం గమనార్హం. చోరీల సొత్తు ఎక్కడ దాచాడు, మూడు గన్‌లు ఎందుకు..ఎక్కడ కొనుగోలు చేశాడనే కోణంలో పోలీసులు విచారించనున్నారు.

అలా అరెస్టు.. ఇలా బెయిల్!

తెలుగు రాష్ట్రాలకు వాంటెడ్‌గా సుప్రీతన్ దత్తా

- నకిలీ కరెన్సీ ముద్రణకు పేపర్ సరఫరాలో దిట్ట
- ఇతగాడిని కోల్‌కతాలో పట్టుకున్న ఏపీ పోలీసులు
- పీటీ వారెంట్ దాఖలు చేసిన రాచకొండ అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: కోల్‌కతాకు చెందిన గ్రాఫిక్ డిజైనర్ సుప్రీతన్ దత్తా నకిలీ నోట్ల తయారీలో కీలకంగా మారాడు. రాచకొండతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ నమోదైన కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నాడు. దీంతో ఈ రెండు పోలీసు విభాగాలకు చెందిన అధికారులు గత వారం అక్కడకు వెళ్లారు. అతికష్టమ్మీద పట్టుకుని అలిపోరే కోర్టులో హాజరుపరిచారు. అయితే న్యాయస్థానం అతడికి వెంటనే బెయిల్ మంజూరు చేయడంతో రాచకొండ పోలీసులు దాఖలు చేసిన పీటీ వారెంట్ సైతం నిష్ప్రయోజనం అయింది. నిందితుడు వద్ద ఎలాంటి నకిలీ నోట్లు లభించకపోవడంతోనే బెయిల్ ఇస్తున్నట్లు ఆ న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

లాక్‌డౌన్ దెబ్బకు నేరబాట...

మహబూబ్‌నగర్ జిల్లా డివిటిపల్లికి చెందిన కర్లీ నవీన్‌కుమార్ 2017లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమో చేయడానికి మహబూబ్‌నగర్ వెళ్లాడు. దాంతో పాటు గ్రాఫిక్ డిజైనింగ్, వెబ్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్ కూడా నేర్చుకున్నాడు. ఆపై నగరానికి వచ్చి వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేశాడు. అయితే కోవిడ్ లాక్‌డౌన్ ప్రభావంతో ఉద్యోగం కోల్పోయి రోడ్డునపడ్డాడు. 2022లో ఫ్రీలాన్స్ గ్రాఫిక్ డిజైనర్‌గా, బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేశాడు. ఈ సంపాదన చాలకపోవడంతో తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించాడు. తనకు ఉన్న గ్రాఫిక్ డిజైనింగ్ ప్రతిభను వినియోగించి నకిలీ నోట్లు తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఆన్‌లైన్‌లో పరిచయమైన ఆ ఇద్దరూ..

యూట్యూబ్ ద్వారా నకిలీ నోట్ల తయారీ విధానాన్ని అధ్యయనం చేసిన నవీన్‌కు... దానికోసం ప్రత్యేకమైన పేపర్ కావాలని గుర్తించాడు. దీన్ని సరఫరా చేసే వారి కోసం ఇండియా మార్ట్ వెబ్‌సైట్‌లో సెర్చ్ చేస్తుండగా... కోల్‌కతాకు చెందిన వ్యాపారి సుప్రీతన్ దత్తాతో పరిచయం ఏర్పడింది. ఇరువురూ వాట్సాప్ ద్వారా సంప్రదింపులు జరపగా..నకిలీ నోట్ల ముద్రణకు అవసరమైన 45 జీఎస్ఎం పేపర్‌ను తాను సరఫరా చేస్తానని అతడు అంగీకరించాడు. ఫేస్‌బుక్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు వాసి వినోద్ ప్రింటర్ తదితరాలను సమకూర్చాడు. డివిటిపల్లిలోని తన ఇంట్లోనే ఈ ప్రెస్ ఏర్పాటు చేసిన నవీన్...అక్కడే సుప్రీతన్ దత్తా సరఫరా చేసిన పేపర్ పైన తాను డిజైన్ చేసిన నకిలీ కరెన్సీని ప్రింట్ చేయడం మొదలెట్టాడు.

కోల్‌కతా, గుజరాత్‌లకు సరఫరా...

ఇలా నవీన్ ఏ4 సైజ్ పేపర్ పైన నకిలీ రూ.500 నోట్లను ప్రింట్ తీయడం మొదలెట్టాడు. వీటిలో 300 షీట్లను సుప్రీతన్ దత్తాకు పంపి రూ.45 వేలు, అతడు చెప్పడంతో మరో 100 షీట్లు గుజరాత్‌కు చెందిన మోఫ్సీకి పంపి రూ.17 వేలు తీసుకున్నాడు. మరికొన్ని షీట్లను నోట్లుగా కట్ చేసి నగరంలో మార్చడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాల్లో ఉన్న ఇతడిని రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు గత నెల 24న తుక్కుగూడలో పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన నకిలీ రూ.500 నోట్లు, తయారీ సామాగ్రి స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో సుప్రీతన్ దత్తా, మోఫ్సీ, వినోద్‌లను నిందితులుగా చేర్చిన అధికారులు గాలింపు చేపట్టారు. సుప్రీతన్ దత్తా నవీన్‌కు పేపర్లు సరఫరా చేసి.. ఇతడి నుంచి తీసుకున్న నకిలీ నోట్ల షీట్లను ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు చెందిన వారికి అందించి సొమ్ము చేసుకున్నాడు.

కస్బా ప్రాంతంలో గాలించిన పోలీసులు..

గుంటూరు గ్యాంగ్‌ను ఏపీ పోలీసులు పట్టుకోగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇతగాడు రెండు రాష్ట్రాల పోలీసులకు సుప్రీతన్ దత్తా వాంటెడ్‌గా మారాడు. ఇతడి కోసం గుంటూరు, రాచకొండ పోలీసులు గత వారం కోల్‌కతా చేరుకున్నారు. అక్కడి కస్బా ప్రాంతంలో ఏపీ పోలీసులకు గత గురువారం చిక్కాడు. దీంతో రాచకొండ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వీళ్లద్దరూ సుప్రీతన్ దత్తాను అక్కడి అలిపోరేలోని న్యాయస్థానంలో హాజరుపరిచారు. తమ ప్రాంతానికి తరలించడానికి పీటీ వారెంట్ కోరారు. అయితే నిందితుడి వద్ద నకిలీ కరెన్సీ దొరక్కపోవడంతో వారెంట్ ఇవ్వడానికి తిరస్కరించిన కోర్టు బెయిల్ ఇచ్చి పంపింది. దీంతో పోలీసులు అతడిని తీసుకువచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు.

బర్డ్ ఫ్లూ కలవరం!

- గ్రామాల్లో ఆందోళన చెందుతున్న పౌల్ట్రీ రైతులు
- భయపడొద్దని పశు సంవర్ధక అధికారుల సూచన

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లోని పౌల్ట్రీ రైతులను కొత్త భయం వెంటాడుతోంది. ఇటీవల ఏపీలో బర్డ్ ఫ్లూ సోకి కోళ్లు మృత్యువాత పడడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ అధికారులు బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మంచాల మండలంలో అధికారుల లెక్కల ప్రకారం 357 బ్రాయిలర్ కోళ్ల ఫారంలు ఉన్నాయి. వాటిలో 32 లక్షలకు పైగా కోళ్లను పెంచుతున్నట్లు సమాచారం. అదే విధంగా 12 లేయర్ ఫారంలు ఉండగా వాటిలో 7 లక్షలకు కోళ్లను పెంచుతున్నారు. ఇప్పటికే వేసవి ఎండల దృష్ట్యా చాలా కోళ్ల ఫారాలకు కోడి పిల్లలు ఇవ్వలేదు. మరోవైపు కోళ్లున్న ఫారాల రైతులకు మాత్రం బర్డ్ ఫ్లూ వైరస్ భయందోళన కలిగిస్తోంది.

తగ్గిన ధరలు

గ్రామాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి గురించి పశుసంవర్ధక శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. కోళ్ల ఫారాలకు సంబంధించిన ఏజెన్సీల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకొని పరిశీలన చేస్తున్నారు. చనిపోయిన కోళ్లను కూడా పరిశీలన చేసి ఏమాత్రం అనుమానం వచ్చినా ఉన్నతాధికారులకు సమాచారం అందించి పరీక్షలకు పంపిస్తామని తెలుపుతున్నారు. మరోవైపు గ్రామాల్లో బర్డ్ ఫ్లూ భయం చక్కర్లు కొడుతోంది. చికెన్ తినేవారు ఒకింత జంకుతున్నారు. కొనుగోలు శాతం కొంతమేర తగ్గిందని చికెన్ విక్రయదారులు చెబుతున్నారు. పదిహేను రోజుల క్రితం కిలో రూ.250 ఉండే, ప్రస్తుతం రూ.196 నుంచి రూ.200 వరకు చికెన్ ధర పడిపోయింది.


మంచాలలోని ఓ ఫారంలో కోళ్లను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారులు

పరిశీలన చేస్తున్నాం



ఇప్పటివరకు మండలంలో బర్డ్ ఫ్లూ సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కనిపించ లేదు. సాధారణ స్థాయి కంటే ఎక్కువ చనిపోతే ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తాం. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బృందం వస్తుంది. శాంపిల్ సేకరించి పరీక్షల చేస్తుంది. బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయితే చనిపోయిన కోళ్లను పెద్ద గొయ్యి తీసి పాతి పెట్టాలి. అలాంటి పరిస్థితి లేదు. ప్రస్తుతం ఎవరూ భయందోళనకు గురి కావొద్దు.

– సుధారెడ్డి, పశువైద్యాధికారి, మంచాల